

సంసారంలో సరిగమలు - తమస్విని



(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..

కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,

కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..

వెరసి సంసారంలో సరిగమలు..!)

తోడు

"గౌరీపతిగారూ మాట."

ఆఫీసులోంచి బయటికి వెళ్ళబోతున్న గౌరీపతి ఆగి చిరాగ్గా చూసాడు.

"రెండు నిమిషాలు. ఇటొస్తారా?" మాధవ ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

గౌరీపతి అతని టేబుల్ దగ్గరికి వెళ్ళి విసుగ్గా అడిగాడు.

"ఏమిటి?"

మాధవ తన ఫోన్‌లోని ఒక ఫోటోని చూపిస్తూ చెప్పాడు.

"మా వదినగారు... అంటే మా ఆవిడ పెదనాన్న కూతురు. నలభై ఏళ్ళ వయసులో భర్త పోయాడు. పాప ఉంది. రెండో పెళ్ళి చేసుకోమని ఒప్పించడానికి పేరెంట్స్‌కు ఇన్నేళ్ళు పట్టింది. ఇప్పుడు నలభై ఐదు. మీకు పెళ్ళి కూడా కాలేదు, రెండో పెళ్ళి సంబంధమా అనుకోవద్దు. మీకు యాభై దాటాయి. పెళ్ళికాని అమ్మాయిలు దొరకటం కష్టం కదా అని." చెప్పాడు.

గౌరీపతి అతని మాటలు వినకుండా విసవిసా అక్కడినించి వెళ్ళిపోయాడు.

"మనిషి మంచివాడే. ఆ తామసం లేకపోతే బాగుండేది." మాధవ నిట్టూర్చాడు.

గౌరీపతి ధుమధుమలాడుతూ గేటు తెరిచి లోపలికి వెళ్ళాడు.

అటూ ఇటూ అన్నీ అపార్ట్‌మెంట్లు వెలిసిన ఆ వీధిలో, ఆ పాత ఇల్లు ఒక్కటే ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఇంటి ముందు చిన్న తోట ఉంది. తాళం తీసి లోపలికి వెళ్తుంటే, పై అంతస్తునించి నవ్వులు వినిపించాయి. 'పూర్వం అద్దెకి ఉన్నవాళ్ళు ఎప్పుడూ అరుచుకుంటూ ఉండేవారు. కొత్తగా వచ్చిన వీళ్ళు ఎప్పుడూ నవ్వులు. అన్నీ విపరీతాలే' అనుకున్నాడు.

టీ కలుపుకుని బయటికి వచ్చి సిమెంట్ బెంచ్ మీద కూర్చున్నాడు. పైన అద్దెకున్న జంట మెట్లు దిగి కిందకి వచ్చారు.

"గుడ్ ఈవెనింగ్ సర్." పాపని ఎత్తుకున్న సంజయ్ పలకరించాడు.

గౌరీపతి తలాడించాడు. అతని భార్య చిరునవ్వుతో నమస్కారం పెట్టింది.

"అలా వాకింగ్‌కి వెళ్ళొస్తాం." చెప్పి అతను భార్యతో గేటు తీసుకుని బయటికి వెళ్ళి, మళ్ళీ గేటు మూసాడు.

తండ్రి భుజం మీంచి వెనక్కి చూస్తూ, పాప చేయి ఊపింది. గౌరీపతి స్పందించలేదు.

ప్రతిరోజు ఆఫీస్ అయ్యాక ఇంటికి వచ్చి, టీ కలుపుకుని, బయట మొక్కల్లో కూర్చోవటం గౌరీపతికి అలవాటు. ఆ సమయంలో ఆయన ఏమీ ఆలోచించడు. ఆలోచించడానికి భయపడతాడు కూడా. గ్లాసుని పక్కన పెడుతూ చూశాడు.

మొక్కల మొదట్లో తడి. ఎండుటాకులు లేకుండా, నేలంతా శుభ్రంగా ఉంది. పైన వాళ్ళు చేసి ఉంటారు. వాళ్ళ అతి చనువుకి గౌరీపతికి కోపం వచ్చింది. మౌనంగా ఆకాశం వైపు చూసాడు. చంద్రుడు రానా వద్దా అన్నట్లుగా దోబూచులాడుతున్నాడు. చుక్కలు ఎక్కడా కనబడలేదు. నిట్టూర్చి, లేచి ఖాళీ టీ గ్లాస్ తీసుకుని లోపలికి నడిచాడు. లైట్ వేసి, వంట గదిలోకి వెళ్ళి, సింక్‌లో ఉన్న పాత్రలు తోమి కడిగిపెట్టాడు. కూరగాయలు ఏమున్నాయో చూసి, వంకాయలు బయటికి తీసి, నీళ్ళ గిన్నెలో వేసి, బియ్యం నానపెట్టాడు.

గేటు చప్పుడు వినిపించింది. చిన్నపిల్ల నవ్వులు. మెట్లమీద అడుగుల శబ్దం. అన్నం వండి కూరని స్టవ్ మీద ఉంచి, టీవీ ముందు కూర్చున్నాడు. వార్తల ఛానల్లో ఏదో చర్చా కార్యక్రమం వస్తోంది. క్రింద స్క్రోల్ అయ్యే వార్తలని చదువుతూ కూర్చున్నాడు. తలుపు చప్పుడైంది. పైనవాళ్ళేనని ఊహించి, లేచి తలుపు తీసాడు. ఎదురుగా సంజయ్. అతని చేతిలో చిన్న గిన్నె.

"తను కంది పచ్చడి చేసింది. రుచికి మీకు ఇవ్వమంటే..."

అతను మొహమాటంగా ఆ గిన్నెని తలుపు పక్క కిటికీలో పెట్టి వెళ్ళాడు. వాళ్ళ అతి చనువుకి గౌరీపతికి మళ్ళీ కోపం వచ్చింది.

భోజనం సమయంలో లేచి ముందు గది కిటికీలోని ఆ గిన్నె తీసుకెళ్ళి, కందిపచ్చడిని కంచంలో వడ్డించుకున్నాడు. ఆ రుచి అతన్ని నలభై ఏళ్ళు వెనక్కి తీసుకువెళ్ళింది. సాయంత్రాలు నాన్నత్త కందిపప్పుని దోరగా వేయించి, రోట్లో రుబ్బేది.

రుబ్బే ఆవిడ లావుపాటి జబ్బని దాన్నించి వేలాడే కండలని గౌరీపతి వింతగా చూసేవాడు. ఓసారి అమాయకంగా అడిగాడు.

"నాన్నత్తా. నీ చెయ్యి ఎందుకంత లూజుగా ఉంది?"

ఆవిడ గలగల నవ్వి, కొంచెం పచ్చడిని అతని అరచేతిలో వేసి చెప్పింది.

"ముసలిదాన్ని కదా?"

ముసలివాళ్ళయితే అలా అయిపోతామా? అని గౌరీపతి భయపడేవాడు.

ఆనాడు ఆవిడ తన చేతిలో పెట్టిన పచ్చడిని నాకినప్పుడు కలిగిన అనుభూతి మళ్ళీ కలిగింది. మజ్జిగన్నం తినకుండా పచ్చడితోనే అన్నమంతా తినేసాడు.

మంచం మీద పడుకుంటే నిద్ర రాలేదు. తలకింద చేతులు ఉంచుకుని, పై కప్పుని చూస్తుంటే, నలభై ఏళ్ళనాటి ఆ ఇంటి వైభవం గుర్తొచ్చింది. ఎంత బాగుండేవి ఆ రోజులు.

🦋🦋🦋

ఆ ఇంట్లో గౌరీపతి అమ్మ, నాన్న, నాయనమ్మ, ఆవిడ ఆడపడుచు ఉండేవాళ్ళు. నాన్న ఆవిడని అత్త అని పిలుస్తాడు కాబట్టి, గౌరీపతి నాన్నత్త అని పిలిచేవాడు. అమ్మ పై పనులు చేస్తే, నాన్నత్త రెండు పూటలా మడి కట్టుకుని వంట చేసేది. నాయనమ్మ పనులేవీ చేసేది కాదు. ఆ ఇద్దరు వృద్ధురాళ్ళకి క్షణం పడేది కాదు. ఏదో ఒక విషయం మీద వాదులాడుకుంటుండే వాళ్ళు, మరుక్షణం కలిసి, కబుర్లు చెప్పుకునేవాళ్ళు. నాన్న స్వరం పెంచి, అమ్మని ఏమైనా అంటే ఇద్దరూ కలిసి నాన్నని తిట్టేవారు. నాన్న మౌనంగా బయటికి వెళ్ళిపోయేవాడు.

ఏ ఆరు నెలలకి ఒకసారో, నాన్నత్త తన అత్తగారివైపు వారి ఫంక్షన్స్‌కి వెళ్ళేది. బావగారి కొడుకు పెళ్ళనో, ఆడపడుచు కోడలు సీమంతమనో. ఆవిడ వచ్చేదాకా నాయనమ్మ అల్లాడిపోయేది.

"మొగుడే పోయాక బావగారేంటి? దీని చేత చాకిరీ చేయించుకోవటానికి పిలుస్తారు. ఈ వెర్రి మొహంది చాకిరీ చేసి వచ్చి అడ్డం పడుతుంది. నా కోడలే చూసుకోవాలి" ఇరుగు పొరుగుకి చెప్పి వాపోయేది.

ఆవిడ వచ్చాక ఓ నాలుగు రోజులపాటు అత్తవారివైపు చుట్టాల విశేషాలు చెపితే, నాయనమ్మ ఆసక్తిగా వినేది. ఐదోరోజు నించి ఇద్దరి మధ్య మళ్ళీ కారాలు మిరియాలు.

ఇద్దరిలో నాన్నత్తే ముందు పోయింది. గౌరీపతి పదో తరగతికి వచ్చేనాటికే ఆవిడ సాయంత్రాలు వంట చేయటం మానేసింది. ఇంటర్మీడియట్లో ఉన్నప్పుడు చిన్న జ్వరానికి రెండు రోజులు మంచం మీద ఉండి, మూడోరోజు పోయింది. నాయనమ్మ హృదయ విదారకంగా ఏడ్చింది.

"నా పెళ్ళయి అత్తారింటికి వచ్చినప్పుడు ఇది పదేళ్ళ పిల్ల. నాకు పధ్నాలుగు. ఇద్దరం వైకుంఠపాళి ఆడుకునేవాళ్ళం. కలిసి పనులు చేసుకునేవాళ్ళం. పెళ్ళయ్యాక నాలుగేళ్ళో ఏమో నాకు దూరంగా ఉంది. ఆ మొగుడు పోయాక మళ్ళీ నా దగ్గరకే వచ్చింది. ఇప్పుడు నన్ను వదిలిపోయింది." పరామర్శకి వచ్చినవాళ్ళకి చెప్పి ఏడ్చేది.

ఆ దిగులుతో ఆవిడ రెండేళ్ళు తిరక్కుండానే పోయింది. డిగ్రీ ఫైనల్ ఇయర్లో ఉండగా, తండ్రి యాక్సిడెంట్లో పోయాడు. తల్లితో గౌరీపతి మిగిలిపోయాడు.

నాన్నత్త, నానమ్మల చాటున ఆకుచాటున పువ్వులా జీవితం గడిపిన గౌరీపతి తల్లి ఇంట్లో తను ఒక్కతే మిగలడం భరించలేకపోయింది. 'పెళ్ళి చేసుకోరా' అని కొడుకుని వేధించేది. కానీ సంబంధాలు చూడటం, నలుగురిని కనుక్కోవడంలాంటివి ఆవిడకి తెలీదు. లోకజ్ఞానం లేని ఆవిడకి పుట్టింటి అండ కూడా లేదు.

విని విని విసిగిపోయిన గౌరీపతి ఒకరోజు అడిగాడు.

"సరే చేసుకుంటానే. ఎవర్ని చేసుకోనూ? పిల్లని చూపించకుండా పెళ్ళి పెళ్ళి అని సతాయిస్తావే?"

ఆవిడ ఇరుగు పొరుగుని కనుక్కుంది. కాని గౌరీపతికి వధువుని తేలేకపోయింది.

"ఇప్పుడు అందరూ ప్రేమించుకుంటున్నారట్రా. ప్రేమ పెళ్ళిళ్ళు ఎక్కువయ్యాయని పక్కింటివాళ్ళు చెప్పారు." కొడుకు మొహంలోకి ఆశగా చూసింది.

గౌరీపతి దిగులుగా నవ్వాడు.

"నీకు పిల్లని చూడటం రాదు. నాకు ప్రేమించటం రాదు. వదిలేయవే అమ్మా. మనం బానే ఉన్నాంగా." చెప్పాడు.

గౌరీపతి ఉద్యోగంలో చేరిన ఏడాదికి ఆవిడా పోయింది. గౌరీపతి ఒంటరిగా మిగిలిపోయాడు. అసలే మితభాషి అయిన అతను ఇంకా ముభావి అయ్యాడు. అతనికి స్నేహితులు లేరు. నాయనమ్మ కాలంలోనే బంధువుల రాకపోకలు లేవు. సొంతంగా వంట చేసుకోవటం, బాక్స్‌లో పెట్టుకుని ఆఫీస్‌కి వెళ్ళడం, సాయంత్రం మళ్ళీ వంట చేసుకుని తినిపడుకోవటం. ఈ విధమైన రొటీన్‌కి అలవాటు పడ్డాక గౌరీపతి మనుషుల ఉనికిని భరించలేకపోతున్నాడు. ఒంటరిగా ఉండాలనిపిస్తుంది. ఇంటికి ఎవరూ రారు. ఆఫీస్‌లో కూడా ఎవరైనా వచ్చి మాట్లాడితే విసుగ్గా ఉంటుంది. శనాదివారాలు ఇంటినించి బయటికి రాడు.

పైనించి పిల్ల ఏడుపు వినబడగానే అతని ఆలోచనలు తెగాయి. అడుగుల చప్పుడు, 'నా అమ్మే. నా తల్లే వచ్చేసాగ ఊరుకో' తల్లి సముదాయిస్తోంది.

అర్ధరాత్రి అవ్వడంతో పరిసరాలు నిశ్శబ్దంగా ఉండి, పైనించి వినిపించే మాటలు అర్థమవుతున్నాయి. 'వచ్చేసా అంటోంది. ఎక్కడికి వెళ్ళింది?' గౌరీపతికి సందేహం వచ్చింది. తర్వాత అర్థమైంది. పిల్లని ముందు గదిలో పడుకోబెట్టి,

వాళ్ళు పడకగదిలో పడుకున్నట్లున్నారు. అతనికి ఏదోలా అనిపించింది. స్త్రీ పురుషుల సంబంధాల గురించి తెలిసినా, దాని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఈ అర్ధరాత్రి ఎందుకో మనసు జారినట్లు అనిపించింది.

ఆ అమ్మాయి మీద కోపం వచ్చింది. చిన్న గిన్నెలో కందిపచ్చడి ఇచ్చి, తన జ్ఞాపకాలన్నీ కదిలించింది. అమ్మ, నాన్న, నాన్నత్త, నాయనమ్మ అంతా గుర్తొచ్చారు. ఏమైపోయారు ఆ మనుషులు? ఎక్కడికి పోయారు? అతనికి దిగులుగా అనిపించింది.

పొద్దున ఆలస్యంగా లేవడంతో వంట చేసుకోకుండా హడావుడిగా తయారై, ఆఫీస్‌కి వెళ్ళడానికి తలుపు తెరిస్తే, వాకిట్లో ముగ్గు కనిపించింది. అమ్మ గుర్తొచ్చింది. ఆమె పోయాక, గుమ్మంలో నీళ్ళు చల్లి, ముగ్గేసింది మళ్ళీ ఇవాళే. పై అమ్మాయిని పిలిచి తిట్టాలనుకున్నాడు, కానీ అసలే ఆలస్యమవడంతో హడావుడిగా వెళ్ళిపోయాడు.

లంచ్ బ్రేక్‌లో కేంటిన్లో ఉప్మా తింటుంటే మాధవ వచ్చి పక్కన కూర్చుని మెల్లిగా చెప్పాడు.

"కూతురు మీతో ఉండటం ఇబ్బంది అనుకుంటే, వాళ్ళ అమ్మమ్మ వాళ్ళు చూసుకుంటామన్నారు."

గౌరీపతి మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయాడు. సాయంత్రం ఆఫీస్ నించి వచ్చి గేటు తీస్తుంటే, బాల్కనీలోంచి పై ఇంటి పిల్ల, 'తాతా తాతా' అని చేతులూపింది.

టీ తాగుతుంటే అలికిడైంది. చూస్తే సంజయ్ భార్య. కూతుర్ని ఎత్తుకుని ఉంది. అతను తనవైపు చూడగానే బిడియంగా అడిగింది.

“జాజిపూలు పూసి రాలిపోతున్నాయి బాబాయిగారు. కోసుకోమంటారా?"

మౌనంగా తలూపి, లేచి వెళ్ళి, కడిగిన పచ్చడి గిన్నె తెచ్చి అరుగుమీద పెట్టాడు. ఆమె ఆయన నించి ప్రశంసని ఎదురు చూసింది కానీ, గౌరీపతి లోపలికి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

ఆ రాత్రి మళ్ళీ సంజయ్ కొబ్బరి పచ్చడి తెచ్చి ఇచ్చాడు. అది అన్నంలో కలుపుకుంటూ అనుకున్నాడు.

'వీళ్ళకి చనువు ఎక్కువైంది. అద్దె ఇవ్వడానికి వచ్చినప్పుడు ఖాళీ చేయమని చెప్పాలి.'

గౌరీపతి పైన వాళ్ళ ఉనికికి అలవాటు పడ్డాడు. వాళ్ళ నవ్వులు, గుసగుసలు, చిన్నపిల్ల అల్లరి, వాకిలి ముందు ముగ్గు, రాత్రిళ్ళు వినిపించే మాటలు...అన్నిటికీ అలవాటు పడిపోయాడు.

ఆ సాయంత్రం సంజయ్ మెట్లు దిగి అతని దగ్గరికి వచ్చి మొహమాటంగా అడిగాడు.

"సార్... చిన్న రిక్వెస్ట్."

గౌరీపతి ఏమిటన్నట్లుగా చూసాడు.

"సినిమాకి వెళ్దామని.. వైలెన్స్, సౌండ్ ఎక్కువగా ఉన్నాయిట. పాప భయపడుతుంది. ఒక్క రెండు గంటలు దాన్ని మీరు చూసుకుంటే, మేము వెళ్ళి వచ్చేస్తాం.. మన ఇంటి దగ్గరే."

గౌరీపతికి ఏం చెప్పాలో తోచలేదు. పిల్లల్ని చూసుకోవడం తనకేం తెలుసు? వాళ్ళు వెళ్ళిపోయాక పాప ఏడిస్తే? అప్పుడు తనేం చేయగలడు?

అతను ఆలోచనలో ఉండగానే సంజయ్ భార్య మెట్లు దిగుతూ కూతురికి చెప్పింది.

"అల్లరి చేయకుండా తాత దగ్గర ఆడుకోవాలి. ఆకలి అయితే బిస్కెట్ తిని, మంచినీళ్ళు తాగు. వచ్చేప్పుడు నీకు బొమ్మలు తెస్తాను. తాతని విసిగించొద్దు."

గౌరీపతి చూస్తుండగానే వాళ్ళు పాపని వదిలి గేటు తీసుకుని వెళ్ళిపోయారు. పాప వాళ్లకి నవ్వుతూ టాటా చెప్పింది. కొద్దిసేపు బయట ఆడుకున్నాక గౌరీపతి దగ్గరికి వచ్చి చెప్పింది.

"తాతా చీకటి పడింది. లోపలికి వెళ్దామా?"

అతను లేచి సంజయ్ భార్య ఇచ్చిన బిస్కెట్ పేకెట్, మంచినీళ్ళ సీసా తీసుకుని లోపలికి వెళ్ళి లైట్ వేసాడు.

పాప కూడా లోపలికి వచ్చి ఇల్లంతా తిరిగి చూసింది.

"నీ పేరేంటి?" అడిగాడు గౌరీపతి.

"బాగ్గెరేక. మీ ఇంట్లో బొమ్మలున్నాయా?" అడిగింది.

"భాగ్యరేఖ!"

పెద్దవాళ్ళ పేర్లు కలిపి పెట్టినట్లున్నారు. నాయనమ్మ గుర్తొచ్చింది.

"గౌరీ. నీకు కొడుకు పుట్టినా, కూతురు పుట్టినా నా పేరే పెట్టాలి రా" అనేది.

"తాతా. మీ ఇంట్లో బొమ్మలున్నాయా?" భాగ్యరేఖ మళ్ళీ అడిగింది.

అతనికి ఇంట్లోని ట్రంక్ పెట్టె గుర్తొచ్చింది. తల్లి పుట్టింటినించి తెచ్చుకున్న ఆ పెట్టెలో చాలా బొమ్మలు ఉండేవి. సంక్రాంతికి బొమ్మల కొలువు పెట్టేటప్పుడే వాటిని బయటకు తీసేది. ఎప్పుడైనా నాయనమ్మలోని అత్తగారు బయటకి వచ్చినప్పుడు ఆ పెట్టె చూపించి వ్యంగ్యంగా చెప్పేది.

"అదేరా మీ అమ్మ పుట్టింటి సారె."

ఆ పెట్టెకి తాళం లేదు. కొక్కెం తీసి మూత తెరిచాడు. దాని నిండా తల్లి ఏభై ఏళ్ళనాటి నిక్షేపాలు. పైనున్న బట్టలని పక్కకి తీస్తే, కింద వెలిసిపోయిన బొమ్మలున్నాయి. వాటిలోంచి రబ్బరు బొమ్మలు తీసి భాగ్యరేఖకి ఇచ్చాడు.

ఆ పాప ఆనందంగా గది మధ్యలో కూర్చుని బొమ్మలతో ఆడుకోసాగింది. అతను ఎప్పట్లా టీవీ మ్యూట్‌లో పెట్టి, స్క్రోలింగ్ వార్తలు చదువుతూ మధ్య మధ్యలో పాపని చూస్తున్నాడు.

భాగ్యరేఖకి మాటలు బాగా వచ్చాయి. బొమ్మలతో ఏకపాత్రాభినయంకాదు... ద్విపాత్రాభినయం చేస్తోంది.

'ఏమండి. ఈ పచ్చడి బాబాయిగారికి ఇచ్చి రండి.'

'ఆయన ఏమనుకుంటారో ఏమో భామా?'

'అనుకోడానికి ఏముంది? మగమనిషి. పచ్చళ్ళేం చేసుకుంటారు? మాట్టాడకుండా ఇచ్చిరండి.'

'అబ్బో తల్లో పూలు పెట్టావే?'

'కబుర్లు చెప్తాయని.'

'ఏం కబుర్లో?'

'పడకగది కబుర్లు.'

గౌరీపతికి నవ్వు వచ్చింది. అర్థాలు తెలియకపోయినా ఆ పాప చిలకలాగా అమ్మానాన్నల పలుకులని వల్లె వేస్తోంది.

"ఆకలేస్తోందా?" అడిగాడు.

తల ఊపి బిస్కెట్ పేకెట్ వైపు చూపించింది.

రెండు బిస్కెట్లు తిని, మంచినీళ్ళు తాగి, అటు ఇటు చూసి దివాన్ మీద పడుకుని బొమ్మలని తన పక్కన పడుకోపెట్టుకుంది.

'పాప నిద్రపోయిందా?'

'ఆహా! పగలంతా ఆటలే కదా. నిద్రపోక ఏం చేస్తుంది?'

గౌరీపతి పకపకా నవ్వాడు. కళ్ళల్లో నీళ్ళు వచ్చేదాకా నవ్వాడు.

ఐదు నిమిషాల్లో పాప నిద్రపోయింది.

అతను వెళ్ళి అన్నం తినేసి వచ్చాడు. ఇంకా సినిమా అయినట్లు లేదు. ముందుగదిలోనే కూర్చుని చాలా రోజుల తర్వాత టీవీలో తెలుగు సినిమా చూడసాగాడు.

గేటు చప్పుడైంది. లేచి తలుపు తెరిచాడు.

"ఏడ్చిందా బాబాయ్‌గారు?" ఆమె ఆదుర్దాగా అడిగింది.

“మిమ్మల్ని విసిగించలేదు కదా?” సంజయ్ అడిగాడు.

“లేదు. బుద్దిగానే ఉంది.” చెప్పాడు.

సంజయ్ లోపలికి వచ్చి నిద్రపోతున్న పాపని భుజం మీద ఎత్తుకున్నాడు. గౌరీపతి రబ్బరు బొమ్మలని ఆమెకి ఇచ్చి చెప్పాడు.

"పాప కొత్త ఫ్రెండ్స్. పక్కనే పడుకోపెట్టండి."



గౌరీపతి ఆ మర్నాడు ఆఫీస్‌లో మాధవ దగ్గరికి వెళ్ళి చెప్పాడు.

"నాకు ఇష్టమే అని చెప్పండి – కూతురితో సహా."

(వచ్చే సంచికలో మరో సరిగమ)

Click here to share your comments